# "ఎడ్డిదై పెయిందూరు"

మా ఊళ్ళె దసురపండుగ చాల మంచిగ జరుగుతది. తాగినా అటేటు దొబ్బుకునుడు, తిట్టుకునుడు జేత్తరు గని కొట్లాడరు. పొరుగూల్లల్ల తలుకాయలు పలుగ్గొట్టుకుంటరు. పోలీసుటేషన్ల సుట్టు తిరుగుతరు. కని మా ఊళ్ళె గట్ల లొల్లులేం గావు. గిట్ల ప్రశాంతంగ జరుగుడు నాకు మంచిగనిపిత్తది.

ఊళ్లె యాటను గొట్టుడసొంటియేం లెవ్వు. అంతకుముందు సావదీసెటోల్లు కని సానేండ్లవట్టి గది గూడ బందు జేసింద్రు. పండుగనాడూల్లె మస్తు యాటల్తెగుతయి. కోల్లు దెగుతయి. సాకలోల్లు పెద్దరాత్తిరి మొదలువెట్టి గొర్లను కోత్తనే ఉంటరు. వాట్ని కోసి పోగులేత్తె[21] మందేమో కూరంత గొంచవోతె కాల్లు, దలకాయలు సాకలోల్లు కొంచవోతరు. కోమట్లు, బాపండ్లు దప్పుతె దసుర పండుగనాడెంత గతిమాల్నోడు గానియ్యి సియ్యకూర దింటడు. ఎల్లకున్నా అప్పుసప్పైన జేసి మాంసం కొంటరు. ఇగ డ్రమ్ములకొద్ది నల్లగల్లు కుండలకొద్ది తెల్లగల్లు ఒడుత్తది. గీ నడుమ బీరు బ్రాందుల గూడ మస్తు తాగుతంద్రు. ఇంకేమో కల్లుసీసాలు తెచ్చుకొని తాగుతంద్రు. పండుగనాడు పొద్దుగాల్నుంచే ఇన్నిన్ని పూరీలు, మాంసం ముక్కలో, గారెముక్కలో, భజ్జీలో, ముద్దగారెలో ముంగట వెట్టుకొని తాగుడు మొదలుపెడుతరు.

సాయంత్రం జంబి ఐతది. కచ్చీరుకాడ జంబికొమ్మలు పాతి ఊరి పెద్దమనుషులను సుంకరోల్లందర్ని పిల్చినంక అయ్యగారు మంత్రం జదువుతడు. ఈ నడుమ పడుసు పోరగాండ్లు కొందరు మంత్రం సదివెదాకనన్న ఆగుతలేరు. ఎగవడి జంబాకు తెంపుకుంటంద్రు. గిట్ల తెంపుకుంటుంటె రొండు మూడు మల్లు అయ్యగారికి సీరుకపెయింది. గందుకే సాయంత్రం తాగుంటరని గీ నడుమ పొద్దుగాల్నే జంబిజేత్తంద్రు.

జంబయినంక జంబాకు ఒగలకొగలిచ్చుకుంట అలాయిబలాయి తీసుకుంటరు. చిన్నోల్లు , పెద్దోల్ల కాల్లు మొక్కుతరు. అల్లు గంపెడుమంది పిల్లలగని సల్లగ బతుకుమని దీవిత్తరు. పొద్దుందాక ఆనాడు పాలపిట్ట, గరుత్మంతున్ని సూసుటానికి కోశిశ్ చేస్తరు. రోజు చెట్టుమీన మస్తుగ కనవడేటియి అమ్మమ్మనీ....................మందులకు గావల్నంటె.......అన్న శాత్రం జెప్పినట్లు అస్సలే కనవడయి. అయినా సొట్లు సొదిచ్చుకొని[22] వాట్ని సూత్తరు మా ఊరోల్లు.

దసుర పండుగని సెలువుపెట్టి ఇంటికి పెయిన. పొద్దుగాల్నె గొర్రె కూరతోని పూరీలు. అన్నం తిన్న. పదకొండు గంటలకే జంబి చేసింద్రు. నాగ్గిది తెలిసేవారకే అయిపెయింది. తమ్ములు,

బామ్మర్దుల వరుసలున్నోల్లు, ఇంకొంతమంది పొల్లగాండ్లు నాకు జంబాకు తెచ్చిపెట్టింగ్రు. అవ్వకు, నాయిన్నకు ఆకు సేతులల్ల పెట్టి కాల్లుమొక్కిన. సెల్లెకు, ఊల్లున్న సుట్టాలందరికీ ఆకు సేతులల్ల పెట్టిన. పెద్దోల్లు నాకు దీవెన్లిత్తె, నా కంటె సిన్నోల్లకు నేను దీవెన్లిచ్చిన. సోపతికాల్లందరికి ఆకిచ్చి. ఆల్ల దగ్గర్నుంచి తీసుకొని అలాయిబలాయి తీసుకున్న. అటెనుక కొంత సేపింట్ల పన్న. సాయింత్రం నాలుగ్గంటలకు లేసి బట్టలేసుకొని బయటికెల్లిన. కచ్చీరుకాడ నిల్సున్న. నన్ను జూసి అట్ల పొయ్యెటోల్లు, నా సోపతికాల్లు రెడ్డోల్లిద్దరు, ఓ కాపయినె వచ్చి నా దగ్గర నిల్సున్నరు.

రెడ్డోల్లిద్దరు బడిపంతుల్లు. అంతకుముందు బూములు బాగనే ఉండె. ఇప్పుడు కొంచెమే మిగిల్నాయి. ఆల్లను ఊల్లె సానమంది దొరలనే పిలుత్తరు. దసుర మంచిగనే ఐపోతందని లోకాన్ని గురించి అదీ ఇదీ బైస్ సేసుకుంట నిల్సున్నం. ఇంతల కొంత దూరంకెల్లి తీగల లసుమయ్యచ్చేది సూసినం. నేసిన. ఆపారం అంగి, మీదికి గుంజి కట్టిన దొడ్డుపంచె గట్టుకొని ఉర్కుంటత్తండు. ఏంటికలు[23] సిక్కిరి బొక్కలై ఉన్నయి. కండ్లెర్రవడి జోతులోలున్నయి. సొలుక్కుంటచ్చి మా దగ్గర నిల్సున్నడు. మా సుదాకర్ రెడ్డి మొకాన జూసుకుంట అన్నడు.

"దొరా! నేందాగలేదంటలేను బాంచెను. కడుపునిండ దాగిన. పూటుగ దాగిన. ఒక్క సొ గాదు. ఆరేడు సొలేసుకున్న. ఇగ జూడు నా నోట్లెకెల్లి ఆసనెట్లత్తందో? అయినా గని నేను కాల్లి[24] దప్పిన్నా? ' అస్సలే తప్పలే. గిట్లనే నేను రోజు తాగుతననుకుంటంగ్రా? నా కొడుకు తోడు దొరా నేను రోజస్సలే తాగ. నా సంగతి మీకు తెలవందేముంది దొర? ఎప్పుడన్నోసారి తాగుత. రోజు తాగన్నని మా ఉంటది గని పైసలేడున్నయి దొర? అచ్చే కైకిలి బువ్వకే సాల్తలేకపాయె. ఇగేంబెట్టి తాగాలె? ఇయ్యాల్ల పండుగ్గద. గందుకే మస్తు దాగిన. గీనికి గిన్ని పైసలేడియనుకుంటరేమో? బాయిల్దవ్వ పోలేదా దొర? గవ్వచ్చినయి. నేనియ్యాల్ల బొక్కకూర గూడ తిన్నదొర. అర్దకిల కూరదెచ్చిన. పులుసువెట్టి, మసాలేసి మంచిగండింది నా పెండ్లాం. సగమంత నేనొక్కన్నే తిన్న దొర. నేన్నిజం సెప్పుతన్న దొర. తాగినోడస్సలే అవద్దమాడడు. అవ్వతోడు దొరా నేను బాగ దాగిన" అనుకుంటూగుతండు లసుమయ్య.

"నువ్వు తాగినవు నిజమే. ఇంట్ల పండుకోపో. నిన్ను జూత్తె తాగుబోతోడంటరు. పో పొయ్యి పండుకోపో" అన్నడు విజేందర్ రెడ్డి

పోకుంటె గిక్కడెందుకుంట దొర? నేను కాల్లి దప్పిన్ననుకుంటంగ్రా ఏంది. ఇంక గింత దాగినా నేనస్సలే కాల్లిదప్ప" అన్నడు గర్వంగ.

"మేం గట్లేమంటలేం గని పొయ్యి పండు పో" అన్న నేను.

"పంట బావ మా పంట. పండకుంటె నేంగిక్కడెందుకుంట? కని ఒక్కమాట సెప్పుత బాప.

మనూరికి దిక్కు సక్కి లేకుంటయింది. ఊరుపాడుగాను ఎడ్డిదైపోయింది బావ" సెప్పుతనే ఉన్నడు.

"ఊరుకేమైంది లసుమయ్య. ఎడ్డిదై పెయిందటన్నవు?" అన్నడు సుధాకర్ రెడ్డి.

"మీరు పెద్దలోకులు దొర. నేను కయికిలి జేసుకునెటోన్ని. గరీబుగాడ్డి కొడుకును. నేను మీకు సెప్పెటోన్నిగాను దొర! కని ఊరికి దిక్కు లేకుంటయింది. ఎడ్డిదయిందూరు. గదేదో పతుకమని మూరిక్కాలువలు పోవుటానికని కాలువల్దవ్విచ్చింండ్రా! బజేర్లనిండ కాల్వలేనా? ఎన్రోజులైన బొందలన్ని గట్లనే ఉండె. మొన్న నాత్రి నడుసుకుంటచ్చిగా బొందలవద్ద. ఇగో గీ మోకాల్లు గొట్టుకపెయినయి" అని మెకాల్లు సూపెట్టిండు. బర్రలింకా[25] ఉన్నయి.

"గా బడి కూలిపెయినా గని ఎవ్వలన్న పట్టించుకుంటండ్రా? గండ్లేమన్న సదువు జెప్పుతండ్రా? రొండేండ్లవట్టి మా పోరన్ని బడికి దోలితె ఇంక ఓనుమాలన్న పురాగ రాకపాయె. మరి గాసాల్రకెవ్వలు జెప్పాలె సెప్పు? పోరన్ని సదువు బందువెట్టి సాపలు వట్టుకరమ్మనన్న తోలు తిగ. ఊల్లె కరెంటున్నా గని ఒక్కసారన్న లైట్లెలుగకపాయె. పొద్దుగాలొక్క బస్సత్తె మల్ల సాయంత్రమే నాయె. గా బస్సుల్ల ఉసికెవోస్తె రాలకుంట మందాయె. ఒంటికాలుమీన నిల్సుండిపోవన్నాయె. ఊర్నెవడన్న మంచిగ సేసెటోడున్నడా సూడుండ్రి దొర"

లసుమయ్య నోట్లెకెల్లి 'రప్‌రప్' మని సారవాసనత్తంది.

"నిజమే కని లసుమయ్య నువ్వింటికి పో" అన్నడు విజేంద్ర.

"మా పోతగని దొర నన్ను జెప్పనియ్యండ్రి. నేనేమన్న కానిది మాట్లాడతన్ననా? ఊర్నంద బతికిచ్చె గా చెరువు మత్తడి కూలగొడితెవ్వలన్న పట్టిచ్చుకున్నరా? ఊరికి కన్నతల్లసొంటిది చెరువు. గదాన్నే ఎవ్వలు సూడకపెయిరి. ఇగ ఊరుకు సక్కేదుంది దొర? ఈ ఊరు పాడుగాను. మందిచ్చె డాక్టరు లేక నా ఆరేండ్లపోరడు ఏర్గవెట్టి సచ్చె. నేను మాట్లాడితె తాగిండంటరు కని మనూరు పురాగెడ్డిదయిపెయింది దొర. ఊరికి దిక్కేలేద్దొర. నా మాటలు నువ్వద్ది దొర. నాకు నా కొడుకు నెవ్వలిత్తరు దొర? నా నారవ్వనెవ్వలిత్తరు దొర? అయ్యో నారవ్వ! నిన్నెట్ల కండ్లజూత్తరా కొడుక' అనేడ్సుకుంట పోతండు లసుమయ్య.

ఉత్త తాగుబోతోనోలె కనిపిచ్చె లసుమయ్య మనుసుల ఊర్ను గురించి, కొడుకు గురించి గింత వేదనుందనుకొని నాకు ఆశ్చర్యమేసింది. అయినె పెయిన దిక్కే సూసుకుంట నిల్సున్నం సానసేపు......... నా నర్సయ్య నెవలిత్తరు అన్నమాటలు ఇంకా దూరంగ వినవస్తనే ఉన్నవి.

★ ★ ★